# సర్దుబాటు

## మాధురి

బయట కాలింగ్ బెల్ మోగింది.

ముందు గదిలో పేపరు చూస్తున్న రావు రెండు నిమిషాలు ఆగి చూశాడు భార్య వచ్చి తలుపు తీస్తుందన్నట్లు.

మళ్ళీ ఆగకుండా బెల్ మోగింది.

అతను తలుపు తీయాలని లేవబోయేలోగానే భార్య అక్కడకు చేరుకుంది... తలుపు తీశాక ఒక సుగంధ పరిమళ భరితమైన కెరటం గదినంతా నింపివేసింది.

అతడు మళ్ళా వెళ్ళి పేపర్లో తల దూర్చాడు. ఒక చెవి పక్క గది మీద వేసి వుంచాడు.

వొచ్చింది అతని కొలీగ్ మోహన్ భార్య సుధ. ఆగకుండా మాటలు వినిపిస్తున్నాయి. ఎంత చురుకైనది సుధ అనుకోకుండా వుండలేక పోయాడు.

వెళ్ళబోతూ "వస్తాను రావుగారూ రేపు శామూ బర్త్ డే. మన పది ఫామిలీస్ కే చిన్న పార్టీ అరేంజి చేశారు. మోహన్ మీకు విడిగా ఫోన్ చేస్తారు లెండి, "డేనియల్" పోదామా?" బయట వెయిట్ చేస్తున్న డ్రయివర్ ని పిలుస్తూ వొయ్యారంగా వెళ్ళిపోయింది.

రావు వోరకంటితో చూశాడు. వొంపు సొంపులు కన్పించేలా నడుము కిందికి చీర, పొడవాటి జడ, ముగ్గురు పిల్లలున్నా పెళ్ళి కాని అమ్మాయిలా వుంది. మోహన్ అదృష్టవంతుడు.

అలా తన ఆగమనంతో రావు హృదయంలో అలజడిని రేపి నిష్క్రమించేది సుధ.

పక్కమీద దుప్పటి సవరిస్తున్న భార్యను చూశాడు రావు.

పల్చటి చీరలు ఆవిడకి పడవుట, ముతక చీరలు తప్ప ఆనవట. ఎక్కడికైనా రమ్మంటే అందరూ తననే చూస్తారని ఎంత సిగ్గో-భయమో.

యిదే సుధ అయితే జమాయించి ప్రయిజు లివ్వటం అవీ కూడ చేసి వస్తూ వుంటుంది.

బియ్యే చదివిందని అనుకుంటారా ఎవరైనా రమను చూస్తే, అప్పటికప్పుడు ఏ సినిమాకో బయలు దేరమంటే పది నిమిషాల్లో తెమలటం చేతకాదు ఆమెకు.

గదులన్నీ తాళాలు పెట్టాలి. చంటివాడ్ని పక్కవాళ్ళకు అప్పగింతలు పెట్టాలి, నున్నగా తల దువ్వి జడ వెయ్యాలి. చీరమార్చాలి యింట్లో శుభ్రమైన యిస్త్రీ చీర కట్టుకుంటే ఏమవుతుందో

సుధ వొక్కపని ముట్టుకోదు. ఏ నిముషానంటే ఆ నిముషాన యిల్లు ప్యూన్స్ కు అప్పగించేసి నిశ్చింతగా బయలు దేరుతుంది. మహారాణిలా ప్రవర్తిస్తుంది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంటే అట్లా వుండాలి.

రావుకు భార్యమీద ఎక్కడ లేని విరక్తి కలిగింది.

వయసుకు మించి కన్పిస్తుంది. నిజానికి సుధకన్న చిన్నదే వయసులో.

o o o

"మనం సుధా వాళ్ళ బాబుకి ఏంతీసి కెళ్దాం"? అడిగింది రమ.

"ఏదో ఒకటి, నీ యిష్టం వచ్చింది తెచ్చుకో" అన్నాడు రావు
"అదేమిటి అలా అంటారు కామిక్స్ సెట్ తెప్పించనా" అంది
"వాకు చదవగలశా వాటిని" అని విసుక్కున్నాడు.
"పోనీ ఓ డ్రెస్ తెమ్మంటారా?"
"ఏంవాడి లేకనా" అన్నాడు.
రమ యిక రావును సంప్రదించకనే ఒక స్టీలు ప్లేటు తెచ్చి గిఫ్ట్ పాక్ చేయించింది.
బయలుదేరేముందు "యిదేదో అట్టహాసం లాగ పట్టుచీర కట్టకపోతే వేరే ఏద. యినా కట్టుకోలేక పోయావు" అన్నాడు.
రమ కొత్తగా పరికించి చూసింది అతన్ని



పార్టీలకు పట్టు చీరలు కట్టటం అలవాటే.
"ఏం యిది బాగు లేదా"? అంది.
"ఎప్పుడు చూచినా చీరలు కొన్నట్టే

పుంటావు-ఎప్పుడూ యిదే కట్టుకుని బయలు దేరుతావు"

అతని చిరాకు అర్థం కాలేదు ఆమెకు.

అంతకు ముందు ఎన్నోసార్లు దయినా కొత్త చీర ధరించినపుడు, అతనితో పది సార్లు బాగున్నదని అన్పించుకుంటే గాని ఆమెకు తృప్తి కలిగేది కాదు.

చీరల విషయం అతనికేమీ తెలియదనుకునేది.

"చీరలో ఏం లేదమ్మాయీ, చీర కట్టుకున్న అమ్మాయిలో వుంది" అంటూ గిలిగిలి చేసే వాడు.

మోహన్ యింట్లో ఫంక్షను ఆరు బయట. సుధ వెలికముడి వేసుకుంది. పెద్ద పెద్దపువ్వులున్న పల్చని కెంపు రంగు చీర ధరించింది. వొకచేతికి గడియారం తప్ప ఏమీ వేసుకోలేదు.

"అయినా నిరాభరణ సుందరి లాగ చక్కగా వుంది. ఎంత అందం" అనుకుంది రమ ప్రశంసా పూర్వకంగా చూస్తూ.

తాంబూలం వల్ల ఎర్రబడిన పెదవులు— తెల్లని సుకుమారమైన దేహం.

"ఆమె ప్రతి కదలికా ఒక అందమే." అనుకుంది. రమకు సుధను చూస్తే ఎప్పుడో చిన్నప్పుడు గతించిన తన చెల్లెలు గుర్తొచ్చి ప్రేమ పెల్లుబుకుతుంది. అంత పర్సాటు చేసినా రవ్వంత అలసట లేదు ఆమె మొహాన. తనకిలాటివి అలవాటే నన్నట్లు ధీమాగా ప్రవర్తించింది. అదే డిపార్టుమెంటువాళ్ళు ఆడా మగా యిరవై మంది దాకా వొచ్చారు.

పిల్లవాడితో కేక్ కట్ చేయించటం-వాడికి తినిపించటం-సుధ ఒయ్యారమే ఒక ప్రత్యేకత.

చీర మీద టీ వొలకబోసుకున్న రమ మీద చీకాకు పడ్డాడు రావు.

"చీర మార్చేసుకో సరిపోతుంది ఏం రమా" అని తేలిగ్గా సర్దేసింది సుధ, రావులోని ఆరాటం, అసంతృప్తి క్షణక్షణానికి అధిక మయ్యాయి. తనంత దురదృష్ట వంతుడు లేడనుకున్నాడు దేవదాసు మొహం పెట్టి. భర్తను వోరకంటితో పరికించింది రమ. అతని చికాకుకు కారణం స్పష్టాస్పష్టంగా వుంది ఆమెకు. అందరి వంకా కలయ జూసింది. ఎవరి మానాన వాళ్ళున్నారు.

జీప్ నడుపుతున్నా రావు ఆలోచనంతా సుధ మీదనే వుంది. సుధ వంటి భార్యను పొందిన మోహన్ ఎంత అదృష్టవంతుడు!

భార్యను వోరగా చూశాడు. పాపిట్లో అక్కడక్కడా మెరుస్తున్న వెంట్రుకలు ఆమెకు పర్సనాలిటి కాన్షస్‌నెస్ ఎప్పుడూ లేదు.

"చూడూ హెయిర్ డై వేసుకోరాదు" అన్నాడు అసందర్భంగా.

రమ సాలోచనగా చూసింది ఏమొచ్చింది యిప్పుడు అన్నట్లు.

"మనిషికి ఎప్పుడూ బ్యూటీ కాన్షస్‌నెస్ వుండాలి. వొళ్ళుచూడు ఎలాగ వచ్చిందో, అన్నం తప్ప చపాతీలు ముట్టనంటావు" అన్నాడు అయిష్టంగా చూస్తూ.

రమ దృష్టి అంతా రోడ్డు మీదనే వుంచింది. మాట్లాడటానికి అసహ్యపడి, మౌనాన్ని ఆశ్రయించింది

సుధపట్ల అనవసరపు చొరవ చూపించటం - అవసరమున్నా లేక పోయినా మాట్లాడబోవటం-గమనిస్తూనే వుంది.

యిల్లుచేరాక చాలా ముభావంగా ఎవరి పనులు వారు ముగించుకుని, పక్క మీదకు చేరుకున్నారు.

రమ పక్కకు వొత్తిగిల్లి పడుకుంటే రావు చాలా సేపు మాగన్నైనా తిరగేస్తూ గడిపాడు. కళ్ళు మూసుకున్నా రమ కళ్ళ

ముందు చీకటి వలయాలున్నాయి. యిద్దర్నీ కలిపివుంచే అనుబంధం యింత అల్పమైనదని వొప్పుకోవటానికి ఆమె మనసు అంగీకరించటంలేదు.

"మీతో ఒక్క విషయం మాట్లాడాలి" అంది నిస్సంకోచంగా.

"ఏం మాట్లాడతావు" అన్నాడు రావు నిర్లక్ష్యంగా పేపరు తిరగేస్తూ.

"దయచేసి కాసేపు ఆ పేపరు కట్టిపెట్టండి—నేనడిగినదానికి జవాబు యిచ్చి తీరాలి"

"ఏమిటినువ్వు అడిగేది?" అన్నాడు.

"యివ్వాళ నన్ను చాలా విషయాల్లో విమర్శించారు మీరు. ఒక్కసారిగా ఎక్కడలేని లోపాలు నాలో కన్పించాయి మీకు. మీ పట్ల అనురాగంవల్ల మీరు కోరిన విధంగా ప్రవర్తించగలనేగాని అది నా తరహా కాదని గుర్తుంచకోండి

హెయిర్ డై వేసుకుని; వొంపులూ సొంపులూ ప్రదర్శిస్తూ ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా మిమ్మల్ని ఆకర్షిస్తూ వుండాలన్న మాట.

ఏరోజుకారోజు మనకు ఏళ్ళుపై బడుతున్నాయన్నది గుర్తుంచుకోండి. పెరిగే పిల్లల ముందు ఎలా మెలగాలన్నది మర్చిపోకండి"—ఏదో అనబోయింది.

"ఆపు నీ వుపన్యాసం. నీ అందచందాల్ని నేను విమర్శించలేదే"

"పైకి అనలేదు. మనసులో అగ్నిరాజజెట్టుకుంటున్నారు. నాకు తెలుసు. సుధలాగ నేను లేనన్నది మీ అసంతృప్తి.

నేను సుధ లాగ వుండాలనేది మీ కోరిక

నేను రమను. రమలాగే వుంటాను. భార్యాభర్తల మధ్య అందచందాల ప్రసక్తి రావటం ఎంత దురదృష్టకరం! మనం యిష్టపడి పెళ్ళి చేసుకున్నాం, ఏ కలతలూ ఎరక్కుండా యిన్నేళ్ళు గడిపాం. కాని అది యింత స్వల్పకారణానికి చెదిరిపోతుందనీ, చిన్న చిన్న ఆకర్షణలకి మీ మనసు రెపరెపలాడుతుందనీ నేను అనుకోలేదు.

మీ భార్య అందంగా వుండాలని మీరనుకోవటంలో తప్పులేదు.

అందానికీ ఆకర్షణకీ అంతెక్కడ ప్రసాద్

నా యిష్టాలకి వ్యతిరేకంగా మీరు రమ్మన్న చోటికల్లా వొచ్చాను. నేను కలిసిపోలేని, నాకు ఆసక్తిలేని స్నేహితులనల్లా మీ కోసం ఆదరించాను.

దీనికి అంతెక్కడ మీ క్రౌర్యానికి అవధులే లేవా?" వుద్వేగంతో కంపించిపోతూ అంది.

"ఏమిటి మాటలు చాలా అంటున్నావు. ఏమన్నాను నేను యింతకీ"

రావు మాటలు పూర్తికాలేదు. రమ అందుకుంది.

"అందచందాల్ని గుర్తించేశక్తి మీలాగే నాకూవుంది. మీరు మోహన్‌లావున్నారా? చంద్రశేఖర్ స్పోర్ట్స్‌మన్. అతన్లా మీరు లేరని నేననుకుంటే మీరు సంజాయిషీ యిచ్చుకుంటారా?" రమ నిర్భయంగా అడిగింది.

రావు మొహాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు

"రమ." అన్నాడు

"అవును మీరు అట్లా పిలిచినపుడల్లా నేను 'వూ' అని జవాబిస్తూనే వుంటాను. సర్దుబాటు నా తత్వం-అది గుర్తుంచుకోండి" అంది రమ.